అసంపూర్తి పనులతో అవస్థలు

• మధ్యలోనే ఆగిన మర్తనపేట, సుద్దాల రోడ్డు పనులు • పూర్తికాని మరిమడ్ల, సిరిసిల్ల డబుల్ రహదారి • ఇబ్బంది పడుతున్న వాహనదారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మండలంలోని మర్తనపేట నుంచి వేములవాడ నంది కమాన్‌కు వెళ్లేరోడ్డు. ఈదారిలో కమాన్ నుంచి పల్లిమక్త వరకు డబుల్ రోడ్డు ఉంటుంది. నాగారం నుంచి మర్తనపేట వరకు సింగిల్ రోడ్డు ఉంది. పల్లిమక్త నుంచి నాగారం వరకు మట్టి రోడ్డు ఉంటుంది. ఒకే రోడ్డు అయినా మూడు విధాలా ఉండడంతో మట్టిరోడ్డా, సింగిల్‌రోడ్డా..డబుల్ రోడ్డా, అన్నది అర్థం కాకుండా ఉంది.



నాగారం వద్ద అధ్వానంగా రహదారి

కోనరావుపేట: మండలంలోని ప్రధాన రహదారుల పరిస్థితి ఇలాగే ఉంది. అన్ని గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రహదారుల పనులన్నీ మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు ఖర్చు... సమస్యలు అలాగే

వేములవాడ నంది కమాన్ నుంచి పల్లిమక్త వరకు నిర్మించిన డబుల్‌రోడ్డు కోసం రూ.8.5 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 8 కిలోమీటర్ల మేర పని జరిగింది. మర్తనపేట నుంచి నాగారం వరకు 3 కిలోమీటర్ల దూరానికి రూ. 80 లక్షలు మంజూరు కాగా నాగారం వరకు సింగిల్‌రోడ్డు పనులు జరిగాయి. నాగారం నుంచి పల్లిమక్త గ్రామం వరకు మట్టి రోడ్డే మిగలడంతో రూ. 45 లక్షలతో అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపించారు. ఇంతవరకు మంజూరుకాలేదు.

కల్వర్టులు నిర్మించకుండా ..

మండలంలోని మరిమడ్ల నుంచి చంద్రంపేట వరకు డబుల్ రోడ్డు పనులను రూ.36 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈ రోడ్డుపై ఉన్న నాలుగు చోట్ల కల్వర్టులు నిర్మించకుండా పనులు పూర్తిచేశారు. డబుల్ రోడ్డు కూడా నిమ్మపల్లి వరకు నిర్మించారు. అజ్మీరాతండా, మరిమడ్ల గ్రామాల మధ్య వదిలిపెట్టడంతో మూలవాగు ప్రాజెక్ట్ వద్ద బురదమయంగా తయారై వాహనాలు వెళ్లలేని విధంగా తయారైంది. ఉన్న పాతరోడ్డు కోతకు గురవుతోంది.

నిధులు మంజూరు చేయాలి



వేములవాడ నందికమాన్ నుంచి పల్లిమక్త గ్రామం వరకు డబుల్ రోడ్డున్నా.. ఇక్కడినుంచి నాగారం వెళ్లాలంటే మట్టిరోడ్డే దిక్కవుతోంది. ఈ మట్టిరోడ్డు కూడా అధ్వానంగా తయారు కావడంతో ఈ దారిన వెళ్లే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలి – జాగీరు కిరణ్‌గౌడ్, పల్లిమక్త

రోడ్డు పనులు పూర్తిచేయాలి



మరిమడ్ల నుంచి వచ్చే రహదారిని అప్పటి ఎమ్మెల్యే కోనరావుపేటకు మళ్లించడంతో నిమ్మపల్లి–మరిమడ్ల శివారులో రోడ్డు పనులు ఆగిపోయాయి. గ్రామానికి వచ్చే రహదారి పనులు ఇప్పటివరకు పూర్తికాలేదు. మూలవాగు ప్రాజెక్ట్ వద్ద రోడ్డంతా బురదమయంగా మారి నడిచేందుకు వీలు లేకుండా ఉంది. అధికారులు రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి.

– పుల్కం మల్లేశం, మరిమడ్ల

ప్రతిపాదనలు పంపాం

కోనరావుపేట మండలం మర్తనపేట నుంచి వేములవాడ నందికమాన్ వరకు రోడ్డు ఉంది. అయితే మధ్యలో మిగిలిన సుమారు 3 కిలోమీటర్ల రహదారి కోసం ప్రతిపాదనలు కూడా పంపాం. ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. ఈ రోడ్డుకు నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంబిస్తాం. వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

– అంజయ్య, ఏఈఈ పంచాయతీ రాజ్

క్లుప్తంగా

సీసీరోడ్ల నిర్మాణానికి రూ.4.80 కోట్లు మంజూరు



మాట్లాడుతున్న దొమ్మాటి నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.4.80 కోట్లు మంజూరు చేసిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలకేంద్రానికి రూ.50లక్షలు, రాచర్లబొప్పాపూర్‌కు రూ.50లక్షలు, రాచర్లగొల్లపల్లికి రూ.50లక్షలతోపాటు వివిధ తండాలు, గ్రామాలకు ఈ నిధులు కేటాయించినట్లు తెలిపారు. నిధుల మంజూరుకు కృషిచేసిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం, సద్ది లక్ష్మారెడ్డి, షేక్ గౌస్, రాంరెడ్డి, సాహెబ్, మల్లేశం, మల్లారెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన వంగపెల్లి శ్రీనివాస్ అనే వ్యవసాయ కూలి పనులు చేస్తూ ఉండగా కింద పడి గాయాలయ్యాయి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌దృష్టికి తీసుకువెళ్లగా అత్యవసర చికిత్స నిమిత్తం రూ. 2.5 లక్షలు మంజూరు చేయించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రోళ్ల భాస్కర్, బొమ్మెన భాస్కర్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ అప్పాల నాగభూషణం, వెంగళ వెంకటేశం, నాయిని ప్రభాకర్, రవీందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్, మేకల స్వామి, రవీందర్, చంద్రయ్య, మల్లయ్య, ముదాం వెంకటేశం, సూర ప్రశాంత్, కొమ్ము నర్సయ్య, మండల జిల్లానాయకులు ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు



తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్ ఎదుట మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకుడు వంగ మణికంఠ ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. శృతి, సౌందర్య, మౌనిక, రవళి, సుజనా, సుప్రియ, రాధా, నందిని, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బన్ని, రవితేజ, రాజేందర్, రాజేశ్, శ్రీధర్, ముకేశ్, కీర్తి, సంధ్య తదితరులున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల, హాస్టల్‌లోని విద్యార్థులను పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేతి శుభ్రతలో మెలకువలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వైద్యుడు సురేశ్‌కుమార్ వివరించారు. సూపర్ వైజర్ రషీద్, హాస్టల్ హెల్త్ అసిస్టెంట్ గణేశ్ పాల్గొన్నారు.

కేక్ కొనుగోళ్లపై లక్కీ డ్రా



ఇల్లంతకుంట: మండలంలో డిసెంబర్ 31 సందర్భంగా బేకరీ దుకాణదారులు పోటాపోటీగా కేకుల అమ్మకాలు చేపట్టారు. దుకాణముల ముందు, బస్టాండ్‌లో టెంట్లు వేసి అమ్మకాలు జరిపారు. ఓ షాపు యజమాని కేక్ కొనుగోళ్లపై లక్కీ డ్రా పెట్టారు. మొదటి బహుమతి 5గ్రాముల వెండి, రెండో బహుమతిగా రెండు గ్రాముల వెండి, మూడు, నాలుగు, బహుమతులు కూడా ప్రకటించాడు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్

వేములవాడఅర్బన్: పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులకు మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యంతాగి వాహనాలు నడపవద్దన్నారు. వాహనదారులు ల్మెట్ హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ ఎస్సై రాజు, ప్రిన్సిపాల్ సుదేశ్ కుమారి, ఉపాధ్యాయులు అంజయ్య, అరుణ్, రజిత, ప్రవళిక, హరీశ్, సుధాకర్, సుధీర్ తదితరులున్నారు.

విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న అడ్వకేట్లు

వేములవాడ: సిరిసిల్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ బిట్ల విష్ణును అక్రమంగా అరెస్టు చేయడానికి నిరసిస్తూ మంగళవారం వేములవాడలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడుతూ, అరెస్టు చేసిన న్యాయవాదిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు రజినీకాంత్, నాగుల సత్యనారాయణ, తిరుమల్‌గౌడ్, పురుషోత్తం, విద్యాసాగర్‌రావు, గోపికృష్ణ, కిషోర్‌రావు, పాత్తూరి అనిల్‌కుమార్, పిట్టల మనోహర్, వేములు సుధాకర్‌రెడ్డి, పెంటరాజు, జనార్దన్, బొజ్జ మహేందర్, గంగరాజు, అభిలాష్, నవీన్, మహేశ్, అజయ్, నాగేందర్, సంగీత, సుజాత, అన్నపూర్ణ, పద్మ, పావని తదితరులు ఉన్నారు.

కార్యవర్గం ఎన్నిక



బోయినపల్లి: మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించినట్లు అధ్యక్షుడు వేముల చిరంజీవి మంగళవారం తెలిపారు. అధ్యక్షుడిగా వేముల చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా దూస రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ షాదుల్, కోశాధికారిగా రోమాల తిరుపతి ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులోని రాచర్లజూనియర్ కాలేజీ వద్ద మంగళవారం సాయంత్రం ఆటోబోల్తా పడ్డ ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. రాచర్లగొల్లపల్లికి చెందిన ఆటో డ్రైవర్ బండి అనిల్ తన ఆటోలో ఎల్లారెడ్డిపేట వైపు వస్తుండగా అదుపు తప్పి డివైడర్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంతో అనిల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వాహనాల తనిఖీ

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో మంగళవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై ఎల్లా గౌడ్ తెలిపారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి



ఎల్లారెడ్డిపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, ఎల్లారెడ్డిపేట, సింగారం, కోరుట్లపేటలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు బాల్‌రెడ్డి, రాములు, గంట వెంకటేశ్ గౌడ్, ఎండీ ఇలియాస్, శ్యామ రాజు ఉన్నారు.

ముస్తాబాద్: పోతుగల్‌లో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు రాజు, మామిండ్ల అంజనేయులు తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

ఎల్లారెడ్డిపేట: మండంలోని దుమాల గ్రామానికి చెందిన జాలపల్లి మైసవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆమె కూతురు పూజ స్నేహితులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. దుమాల హైస్కూల్‌లో 2011–12 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు రూ.13,500 ఆర్థికసాయంగా అందించారు. మాజీ సర్పంచ్ కదిరె శ్రీనివాస్ రూ.వెయ్యి అందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం పాత్తూరు సమీపంలోని బిక్కవాగు నుంచి కర్ల దనేష్, మారుపాక వంశీ మంగళవారం తమ ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్సై కె.శ్రీకాంత్ తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నియామకం



నియామకపత్రం అందిస్తున్న సంఘం సభ్యులు

వేములవాడఅర్బన్: బీసీ జాతీయ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా వేములవాడ మండలం సంకెపల్లి గ్రామానికి చెందిన మారవేణి మహేశ్ యాదవ్‌ను నియామించినట్లు జిల్లా అధ్యక్షుడు పర్శరాం తెలిపారు. ఈ మేరకు నియామకపత్రం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్ తేజచారి, సంఘస్వామి యాదవ్, ఎడ్ల నరేందర్, కాసర్ల అరుణ్ కుమార్, దానే తిరుపతి తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన వాసరవేని పర్శరాములు రాష్ట్ర బీసీ అధ్యాపకుల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని కాచిగూడలో జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య సమక్షంలో జరిగిన రాష్ట్ర బీసీ అధ్యాపకుల సంఘం కార్యవర్గ సమావేశంలో పర్శరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కె. సుదర్శన్, ప్రధాన కార్యదర్శి ఎమ్. విఠల్‌లు నియామకం పత్రం అందజేశారు.

పత్తి మిల్లు పరిశీలన



ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి పత్తిమిల్లులో షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, డైరెక్టర్లు మచ్చ రాజేశం, కేతిరెడ్డి వెంకట్ రెడ్డి, సుధగోని తిరుపతి గౌడ్, దారం నరసింహారెడ్డి, తాట్లవీరేశం , ఐరెడ్డి సురేందర్ రెడ్డి, అల్లెపు రజనీకాంత్, సత్య రెడ్డి, నాయకులు ఐరెడ్డి మహేందర్ రెడ్డి పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్ సంబంధించి మిల్లు యజమానులను సీసీఐ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ కేసులో ఒకరి అరెస్ట్

తంగళ్లపల్లి: మండలంలోని తాడూర్ గ్రామంలో సర్వే నంబర్ 1148లో 11 ఎకరాల అసైన్డ్ భూమిని అక్రమంగా తమ పేరిట మార్చుకున్న ముగ్గురు వ్యక్తులపై తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. ముగ్గురిలో ఒకరిని మంగళవారం రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. భూమిని తమ పేరున మార్చుకున్న వ్యక్తులతోపాటు సహకరించిన రెవెన్యూ అధికారులపై కూడా కేసు నమోదు చేశామన్నారు.

పంటల నమోదు పరిశీలన

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్, కొత్తపేటలో వానాకాలం సీజన్‌లో రైతులు వేసిన పంటల నమోదు ప్రక్రియను మంగళవారం పరిశీలించినట్లు ఎంఏవో కే.ప్రణీత తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు సాగులో మెలకువలు, యాజమాన్య పద్ధతుల గూర్చి తెలిపారు. కాగా పలు గ్రామాల్లో రైతులు వరినాట్లు, కొంతమంది రైతులు మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. ఆమెవెంట ఏఈవోలు, రైతులు ఉన్నారు.



గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రంలో దుబ్బాక పోచమ్మ ఆలయం నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే దారిలో ఇళ్ల నుంచి డ్రైనేజీ నీరు రోడ్డుపై పారుతోంది. మురుగు నీరంతా పంచాయతీ బోరుబావిలో కలుస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఆ నీటినే తాము వినియోగించుకోవాల్సి వస్తోందని, సంబంధిత అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
లక్ష్మణ్, ఈవో సెల్‌నంబర్ : 9849597070

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

విధులకు రాకున్నా రిజిస్టర్‌లో సంతకం

• పశువైద్యాధికారి తీరుపై రైతుల ఆందోళన



ఆసుపత్రి ఎదుట రైతుల ఆందోళన

ముస్తాబాద్: ముస్తాబాద్ పశువైద్యశాల ఎదుట రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కొత్తగా విధుల్లో చేరిన పశువైద్యాధికారి పదిరోజులుగా విధులకు రావడం లేదని ఆరోపించారు. మంగళవారం విధులకు హాజరుకాకున్నా రిజిస్టర్‌లో సంతకం చేశారని పేర్కొన్నారు. అటెండర్ మాత్రమే అందుబాటులో ఉన్నారని, పశువైద్యాధికారి రాలేదని తెలిపారన్నారు. దీనిపై జిల్లా పశు వైద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు రైతు మెంగని మహేందర్ తెలిపారు. విచారణ చేసి పాడి రైతులకు న్యాయం చేయాలని కోరారు. పశువులకు మెరుగైన వైద్యం అందించి, అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు రాజు, లింగారెడ్డి, ఎల్లారెడ్డి, కనకరాజు, మహేశ్, శీలంస్వామి, పవన్, వేణు తదితరులు కోరారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా బీఆర్ఎస్



చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఆపద సమయంలో పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని సింగారంకు చెందిన ముత్యాల బాలకిషన్ విద్యుత్‌షాక్‌తో మృతిచెందగా బాధిత కుటుంబానికి రూ. 2లక్షలు, రాచర్లగొల్లపలికి చెందిన ఊరడి మహేశ్ అనే కార్యకర్త ప్రమావశాత్తు మృతిచెందగా వారి కుటుంబానికి రూ. 2లక్షల చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ.. కార్యకర్తలను కాపాడుకోవడానికి పార్టీ ఎప్పుడు ముందుంటుందన్నారు. పార్టీ నుంచి బీమా చెక్కుల మంజూరుకు కృషిచేసిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు కొండ రమేశ్ గౌడ్, అందే సుభాష్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, నర్సింలు, ఉస్మాన్, దేవరాజు, సీత్యానాయక్, సురేశ్, ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి, దేవిరెడ్డి, కొండ ఆంజనేయులుగౌడ్, జబ్బర్, దేవయ్య, అందే సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ



ఇల్లంతకుంట : మండలంలోని కందికట్కూర్‌లో మంగళవారం లక్ష్మారెడ్డి ఇంటిలో మహా పడిపూజ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని అయ్యప్ప స్వాములు పూజా కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప భజన గీతాలు ఆలపించారు. గురుస్వాములు ఎర్రోజు గోపాలాచారి, బిల్ల రఘు స్వామి, ఈదుల రవీందర్ రెడ్డి స్వామి, ముంజ భూపతి స్వామి, కరీంనగర్ శ్రీనివాస్ గురుస్వామి, అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ఎల్లారెడ్డిపేట: తల్లిదండ్రుల కలను సాకారం చేస్తూ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ప్రముఖ వైద్యులు జి.సత్యనారాయణస్వామి అన్నారు. మండలానికి చెందిన విద్యార్థులు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జూడో క్రీడల్లో గోల్డ్‌మెడల్ సాధించగా వారికి మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. జూడోలో ధరావత్ సునీత, సపవతి రమ్య, రమావత్ చాందిని, మచ్చ ఉశశ్విని, దేవుళ్ల ఝాన్సీ గోల్డ్ మెడల్ సాధించారు. వీరిని మండల కేంద్రంలోని తన హాస్పిటల్‌లో సత్కరించారు. అశ్విని హాస్పిటల్ డైరెక్టర్ అభినయ్, వైద్యులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న ట్రాలీ ఆటో



బోల్తాపడిన ట్రాలీ ఆటో

చందుర్తి: మండలంలోని మల్యాల పెద్దమ్మ దేవాలయం సమీపంలో కుక్కను తప్పించబోయి మంగళవారం ట్రాలీ ఆటో ఆర్టీసీ బస్సును మంగళవారం ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రం నుంచి రుద్రంగి వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో, బీంగల్ నుంచి వేములవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సును మల్యాల పెద్దమ్మ ఆలయం వద్ద ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ రాజేశం స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఆర్టీసీ బస్సు అద్దం పగిలిపోయింది. ఎవరికి ఎలాంటి గాయాలుకాలేదు. ఈ విషయమై చందుర్తి పోలీసులకు అడగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

జీపీ కార్మికుడికి తీవ్రగాయాలు

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మల్యాల గ్రామపంచాయతీ కార్మికుడు దుర్గయ్య తన మోపేడ్‌పై ఇదే మర్రిగడ్డలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో మర్రిగడ్డ గ్రామ శివారులో ద్విచక్రవాహనదారుడు మోపేడ్‌ను ఢీకొట్టి పారిపోయాడు. ఈ ప్రమాదంలో దుర్గయ్యకు తీవ్ర గాయాలుకాగా 108 అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రత్యేక తరగతులు

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు గాను వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 20 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దేవరాజం తెలిపారు.